క్లుప్తంగా

14 టైర్ల టిప్పర్ ఓనర్ల పాత కమిటీ రద్దు

మణుగూరుటౌన్: 14 టైర్ల టిప్పర్ ఓనర్స్ పాత కమిటీని వ్యతిరేకిస్తూ ఐఎన్‌టీయూసీ అనుబంధంగా నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్నట్లు లారీ యజమానులు ఈశ్వర్‌రెడ్డి, శాంతకుమార్, హకీం, రమేశ్, రమణ, బనాకర్‌లు పేర్కొన్నారు. సోమవారం లారీ కాంటా వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో వారు ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి మాట్లాడారు. 14 టైర్ల టిప్పర్ యజమానులకు ప్రస్తుతం ఉన్న కమిటీ తీరని అన్యాయం చేస్తోందన్నారు. కొందరికి ఒక పద్ధతిలో కిరాయిలు కట్టించడం మరికొందరికి అధిక రేట్లతో కిరాయి రేట్లు కట్టించడంతో పాటు బిల్లులు ప్రతి నెలా చెల్లించాల్సినప్పటికీ పాత కమిటీ అధ్యక్షుడు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైనట్లు ఆరోపించారు. లారీ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు, దాదాపు 39 నెలలుగా నెలకు రూ.లక్షకు పైగా వస్తున్న ఆదాయాన్ని పక్కదారి పట్టించినట్లు తెలిపారు. కేసీటీ ట్రాన్స్‌పోర్ట్ టెండర్ ముగిసి ఆరు నెలలు అవుతున్నా నేటికీ బిల్లులు ఇప్పించలేక పోయారని అన్నారు. ఈ నేపథ్యంలో పాత కమిటీని వ్యతిరేకిస్తూ నూతన కమిటీని ఐఎన్‌టీయూసీ అనుబంధంగా ఏర్పాటు చేసుకుంటున్నట్లు వివరించారు. వీరిలో 15 మంది సభ్యులు ఉన్నారని వీరితో త్వరలో కొత్త కమిటీకి నూతన అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి.నవీన్, శివ, సుబ్బారెడ్డి, దొబ్బల వెంకటప్పయ్య, పాలమూరి రాజు, జీవరత్నం, గాండ్ల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కుంకుడుచెట్ల గుంపుతోపాటు పలు ప్రాంతాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది మాట్లాడుతూ.. ఈ వ్యాధి చర్మానికి, నరాలకు వస్తుందని, ముదురు రాగి రంగు మచ్చలుండి స్పర్శ లేని వారిని పీహెచ్‌సీకి తీసుకురావాలని సూచించారు. అనంతరం స్పర్శ లెప్రసీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, జ్యోతి, సుమలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలను నేరవేరుస్తుందని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్ అన్నారు. సోమవారం అశ్వారావుపేటలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దేశ ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్.. ఆర్థిక, దేశాభివృద్ధిని ప్రోత్సహించేలా ఉందని, ఇదీ ప్రజారంజక బడ్జెట్ అన్నారు. సామాన్య పేద, మధ్యతరగతి ప్రజలకు, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుట్టుపూల శ్రీనివాస్, జల్లిపల్లి అరవింద్, మద్దాల దేవి, పుష్కర్ కుమార్, చిట్టి శ్రావణ్, కలకోటి కృష్ణ, శీమకుర్తి సుబ్బారావు, మాటూరి విజయ్, శ్యాం, వినోద్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి..

అశ్వాపురం: ఎస్సీ వర్గీకరణపై అనుకూల ప్రకటన చేసి ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో మాదిగ జేఏసీ జిల్లా నాయకుడు దేవంగి వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్దల నర్సయ్య, నంద్రు వెంకటి, ఇసంపల్లి వెంకటి, కొప్పుల నరసింహారావు, రావులపల్లి నాగేశ్వరరావు, గొడ్ల రమేష్ పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్లు మంజూరు చేయాలి

చర్ల: దళితబంధు రెండో విడత కింద ఎంపికైన తమకు వెంటనే యూనిట్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు సోమవారం ఎంపీడీఓ ఈదయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రెండో విడత కింద చర్ల మండలంలో ఎంపికైన 220 మందికి ఇంత వరకు యూనిట్లను మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఏడాది కావస్తున్నప్పటికీ ఇంత వరకు వాటి గురించి పట్టించుకున్నది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మణుగూరురూరల్: ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన గోడ పత్రికలను ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కొమ్ము హుస్సేన్ సోమవారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బోయిళ్ళ వెంకటేశ్వర్లు, బోయిల్ల నరసింహారావు, చిట్యాల రజిత, చెక్క రమేష్, రాజు, బాబన్న, మోదుగు వెంకటేశ్వర్లు, పొడుతూరి కల్యాణి, మంద కృష్ణ, మోదుగు తిరుపతి పాల్గొన్నారు.

మసకబారుతున్న మణుగూరు శోభ

- వలసలతో ఖాళీ అవుతున్న ఇళ్లు
- కొనుగోలుదారుల లేక పడిపోతున్న వ్యాపారాలు
- వీధుల్లో తగ్గిన దుకాణాల హంగామా



మణుగూరు పట్టణం వ్యూ



టూలెట్ బోర్డులతో దుకాణాలు

మణుగూరుటౌన్: పట్టణానికి ఒకవైపు సింగరేణి, మరోవైపు గోదావరి ఆధారంగా ఏర్పడ్డ బీటీపీఎస్, హెవీవాటర్‌ప్లాంట్‌లతో పాటు ఇతర పరిశ్రమలు, వ్యాపారాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 40 వేల మంది ఆధారపడి ఉన్నారు. వీరికి జీవనాధారం కల్పించి, నివాసానికి వేదికగా మారిన మణుగూరు.. క్రమక్రమంగా పెరిగిన విస్తరించింది. అమాంతం పెరిగిన భవనాల ధరలు, నిర్మాణాలు, అద్దెలు, వ్యాపార సముదాయాలతో మణుగూరు పట్టణం శోభను సంతరించుకుంది. ప్రస్తుతం మణుగూరు ఆనాటి కళను, శోభను క్రమక్రమంగా కోల్పోతోందా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

అడుగడుగునా టూ లెట్ బోర్డులు!

వేలాది అద్దెలు, లక్షలాది అడ్వాన్సులతో వ్యాపారాలు కళకళలాడిన మణుగూరు పట్టణం.. ప్రస్తుతం ప్రధాన ప్రదేశాలు మినహా మిగిలిన చోట్ల టూ లెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. నివాసాలైతే ప్రతి వీధిలో ఇళ్ల ఎదుట టూ లెట్ బోర్డులే స్వాగతం పలుకుతున్నాయి. బేరాలు లేక వ్యాపారాలు సాగక అద్దెలు కట్టలేక వ్యాపారాలు కొంత మేర వెనక్కు తగ్గాయి.

విస్తరణ లేకపోతే అంధకారమేనా?

మణుగూరు దశను మార్చిన సింగరేణి తన ప్రాబల్యాన్ని చాటాలన్నా.. తనపై ఆధారపడిన సింగరేణి కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు, వ్యాపార వర్గాలకు, లారీల యజమానులకు ఉపాధి కల్పన జరగాలన్నా విస్తరణ తప్పనిసరి. మణుగూరు ఓసీ విస్తరణ ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా మారగా, బొగ్గు బ్లాకులకు వేలం జరుగుతున్న తరుణంలో భవిష్యత్తులో గనుల విస్తరణ ప్రశ్నార్థకంగా మారింది. అలాంటి పరిస్థితుల్లో మణుగూరు ఓసీ విస్తరణలో జరుగుతున్న జాప్యం పట్టణ అభివృద్ధిపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ఇప్పటికైనా మణుగూరు ఓసీ విస్తరణలో జాప్యాన్ని నివారించి విస్తరణకు అడుగులు వేగంగా పడేలా మార్గం సుగమం చేయాలని పలువురు కోరుకుంటున్నారు.

కారణాలు ఏంటి?

మణుగూరు తన శోభను కోల్పోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా సింగరేణి నుంచి ఆశించినంత బొగ్గు.. రోడ్డు రవాణా సాగడం లేదు. లారీల ద్వారా బొగ్గు తరలింపు క్రమక్రమంగా తగ్గి కొన ఊపిరితో యూనియన్ కార్యకలాపాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిపై ఆధారపడిన కుటుంబాలు ప్రత్యామ్నాయ దిశగా అడుగులు వేస్తూ తరలి వెళ్లిపోతున్నాయి. బీటీపీఎస్ నిర్మాణ సమయంలో వలస వచ్చిన అధికారులు, కార్మికులు వెళ్లిపోవడం కూడా ఒక కారణం. ఇలా జనం వెళ్లడంతో ఇళ్లలో టూలెట్ బోర్డులు కనిపిస్తున్నాయి. కొనగోలుదారుల సంఖ్య తగ్గి వ్యాపారాలూ దివాళా తీస్తున్నాయి.

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి



అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో వ్యాపారులు నిలదొక్కుకోవాలి. సింగరేణి, బీటీపీఎస్, హెవీవాటర్ ప్లాంట్‌లో ఆధారపడిన ఎందరో కార్మికులతో ఇక్కడి వ్యాపారులకు సత్సంబంధాలు నెలకొన్నాయి. అలాంటి వారు ఇక్కడి నుంచి వెళ్లిపోవడం వల్ల అనుబంధాన్ని కోల్పోతున్నారు. ఇక్కడే ఉంటూ ప్రత్యామ్నాయం దిశగా అడుగులు వేయాలి.

– చెన్నకేశవరావు, మాజీ వార్డు మెంబర్, సమితిసింగారం


ఓసీ విస్తరణకు భూసేకరణ



ఓసీ విస్తరణకు అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. మణుగూరు ఓసీ ప్రస్తుత భవిష్యత్తు మరో ఏడాది ఉంది. ఓసీ విస్తరణ అటవీ భూసేకరణ దాదాపు పూర్తి కావొచ్చింది. ఓసీ విస్తరణతో మరో 15–20 సంవత్సరాల భవిష్యత్తు పెరుగుతుంది. తద్వారా సింగరేణి సమీప ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటునిస్తుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

– దుర్గం రామచందర్, ఏరియా జీఎం

ఎంపీటీసీ స్థానాల ఖరారు



అశ్వారావుపేట ఎంపీటీసీ స్థానాల మార్పుతో కొత్తగా విడుదల చేసిన మ్యాప్

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటకు రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటీ హోదా కల్పించిన సంగతి తెలిసిందే. దీంతో మండలంలోని ఎంపీటీసీల స్థానాల మార్పు, చేర్పుల ప్రక్రియ చేపట్టారు. దీంట్లో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అనుమతితో ఎంపీటీసీ స్థానాలు కుదింపు వివరాలను స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంతోపాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నోటీసు బోర్డులో ప్రజలకు సమాచారాన్ని అందించేందుకు ప్రదర్శించినట్లు స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలో మొత్తం 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, మున్సిపాలిటీ హోదా కారణంగా అశ్వారావుపేటలోని 4, పేరాయిగూడెం పరిధిలోని మరో 2 ఎంపీటీసీ స్థానాలు రద్దు కావడంతో పేరాయిగూడెం–2 ఎంపీటీసీ పరిధిలో ఉన్న పాత అల్లిగూడెం పంచాయతీని నారంవారిగూడెం ఎంపీటీసీ స్థానంలో, అలాగే వేదాంతపురం గ్రామ పంచాయతీను ఊట్లపల్లి ఎంపీటీసీ స్థానంలో విలీనం చేసినట్లు వెల్లడించారు. అదే విధంగా మండల నూతన మ్యాప్ కుడా ఎంపీడీఓ విడుదల చేశారు.

చంద్రుగొండ: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి రెండు మండలాల మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల (ఎంపీటీసీ) స్థానాలను ఖరారు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓలు బయ్యారపు అశోక్, మహాలక్ష్మి సోమవారం వివరాలు వెల్లడించారు. చంద్రుగొండ మండలంలో చంద్రుగొండ 1, చంద్రుగొండ 2, దామరచర్ల, తిప్పనపల్లి, తుంగారం, రావికంపాడు, పోకలగూడెం, బెండాలపాడు ఆ లిస్టులో ఉన్నట్లు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో 8 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయని ఎంపీడీఓ మహాలక్ష్మి తెలిపారు. త్వరలోనే ఎన్నికల పోలింగ్ రూట్ మ్యాప్ వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని ఇస్తాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని గోపాలరావుపేట గ్రామంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే అధికారుల క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం విలేకరుల ఆధ్వర్యంలో అధికారుల క్రికెట్ టోర్నమెంట్ ఆడటం చాలా సంతోషకరమని, పని ఒత్తిడి నుంచి ఒక నాలుగైదు రోజులు ప్రశాంతతను ఆనందాన్ని కలిగిస్తాయన్నారు. ఇటీవల కాలంలో క్రికెట్‌లో మన ప్రాంతం వారు రాణిస్తున్నారని, అండర్ 19 టోర్నమెంట్‌లో భద్రాచలం అమ్మాయి గొంగిడి త్రిష అద్భుతంగా రాణించిందని అన్నారు. ప్రభుత్వం తరఫున అభినందిస్తున్నామన్నారు. గోపాలరావు పేట గ్రౌండ్‌ను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన చాతర్ల వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంకన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, కొండబత్తుల ఉపేందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి జాతర ప్రారంభం



గ్రామ సరిహద్దులో పొలిమేరలు కట్టేందుకు వెళ్తున్న ఆలయ పూజారులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి 23వ జాతర పండుగ మహోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచే పలు పూజలు, నైవేద్యాల చేపట్టారు. భక్తులు సమర్పించిన చీరలతో అమ్మవారిని అలంకరించారు. సాయంత్రం మేళ తాళాలతో డప్పులతో అమ్మవారి వటవృక్షం నుంచి పుట్ట బంగారం తెచ్చే కార్యక్రమాన్ని అశేష భక్తజనం మధ్యన చేపట్టారు. అమ్మవారికి అఖండ దీపారాధన పూజా కార్యక్రమాలు చేపట్టి జాతరను ప్రారంభించారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు రాత్రి హైదరాబాద్‌కు చెందిన బాబి ఈవెంట్స్ వారి డాన్స్ బేబి డాన్స్ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని తహసీల్దార్ అశోక్ కుమార్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు..

గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కుటుంబ సమేతంగా జాతర మొదటి రోజు సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ కమిటీ ఘనంగా స్వాగతం పలికారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, ఆలయ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు యలమంచి రవికుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి, ఎండి.హలీం ఖాన్, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ, అన్నె సత్యనారయణమూర్తి, కుంజా శ్రీను, కెల్లా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాలను వినియోగించుకోవాలి

మణుగూరురూరల్: బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్య సాధనలో యంత్రాల శక్తి సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ సూచించారు. ఏరియాలోని మణుగూరు ఓసీ గని డంపర్ సెక్షన్‌లో ట్రాక్టర్ ఇండియా లిమిటెడ్ వారి 40 టన్నుల సామర్థ్యం గల ఆధునిక టైర్ మౌంటెడ్ రఫ్ టెర్రెయిన్ భారీ క్రేన్‌ను సోమవారం ఏరియా జీఎం దుర్గం రామచందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్య సాధన కోసం సింగరేణి యాజమాన్యం ఖర్చుకు వెనుకాడకుండా రూ.1.74కోట్ల విలువైన భారీ క్రేన్‌ను మంజూరు చేసిందన్నారు. ఆపరేటర్లు వృత్తి నైపుణ్యతను, అనుభవాన్ని ప్రదర్శి ఎలాంటి ప్రమాదాలకు చోటులేకుండా రక్షణ చర్యలతో యంత్రాలను నడపాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి వెంకటరామారావు, గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారి, గని మేనేజర్ బి.వెంకటేశ్వర్లు, రక్షణ అధికారి భాస్కర్‌రావు, అడిషనల్ మేనేజర్ నవీన్, ఏరియా రక్షణ అధికారి కె.శ్రీనివాస్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భారీ క్రేన్‌ను ప్రారంభిస్తున్న ఏరియా జీఎం రామచందర్

విద్యుత్ సరఫరా నిలిపివేత

ములకలపల్లి: ములకలపల్లి మండలకేంద్రంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్–కో ఏఈ బి.నరేశ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ములకలపల్లి టౌన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కరకగూడెం: నేడు 33/11కేవీ కరకగుడెం ఉపకేంద్రంలో 33 కేవీ కరకగూడెం లైన్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎలక్ట్రీషియన్ల ఆర్థిక సాయం

చంద్రుగొండ: అనారోగ్యంతో బాధపడుతున్న తొటి సహచరుడికి ఎలక్ట్రీషియన్ల మండల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఆర్థిక సాయం అందించారు. ఇంధిరానగర్‌కు చెందిన హబీబ్ అనే ప్రవేట్ ఎలక్ట్రీషియన్ ఇటీవల గుండెపోటుకు గురయ్యాడు. చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అతడికి సంఘం తరుపు నుండి రూ.10 వేలు సాయం అందించారు. సంఘం సభ్యులు ఎస్‌కె.ఆసీఫ్, బాబురావు, వెంకటాచారి, వీరేంద్ర, నజీర్, షావలీ, షబ్బీర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: మండల కేంద్రంలో సంత్ సేలాల్ సేన కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సంఘం రాష్ట్ర కోకన్వీనర్ బి.హుస్సేన్ నాయక్ సమక్షంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గుగులోత్ రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజ్మీరా నిర్మల, మండల అధ్యక్షుడిగా గుగులోత్ రవికుమార్, మహిళా అధ్యక్షురాలిగా ఇస్లావత్ ద్వాలి,ఉపాధ్యక్షురాలిగా గుగులోత్ కవిత, అధికార ప్రతినిధిగా అజ్మీరా రాజేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా భూక్యా బాలకృష్ణ, మండల కార్యదర్శిగా బానోత్ శాంతి, ఉపాధ్యక్షుడిగా ఇస్లావత్ శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు రాష్ట్ర కోకన్వీనర్ హుస్సేన్ నాయక్ నియామకపత్రాలను అందజేశారు.

గోశాల నిర్వహణకు విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆవరణంలోని గోశాల నిర్వాహనకు సోమవారం భక్తులు విరాళం అందజేశారు. ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన శ్రీహరి–కవిత దంపతులు రూ.56,425 చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతో పాటు జ్ఞాపికను అందజేశారు.

వైభవంగా వసంత పంచమి

వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. సరస్వతి మాత పుట్టిన రోజును పురస్కరించుకుని పలు ప్రాంతాల్లోని పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. గణపతి హోమం, సరస్వతిదేవి పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. కొన్ని పాఠశాలల్లో సరస్వతి విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: బ్రిలియంట్ స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసాలు



బూర్గంపాడు: సరస్వతి శిశుమందిర్‌లో..



దమ్మపేట: విద్యార్థినికి పెన్ను, నోట్ పుస్తకాలను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు ఎస్‌డీ సలీం

అశ్వారావుపేటరూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తెచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌డీ సలీం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీన వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా, కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, బీకేఎంయూ ఆధ్వర్యంలో అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని, ఆయా నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గన్నిన రామకృష్ణ, డేరంగుల చిన్నయ్య, సాల రవి, పఠాన్ జలాల్, షేక్ అబ్బాస్, పిచెన్నారావు, ఎన్.విజయకాంత్, చీపుర్ల సత్యవతి, రిజ్వానా, శ్రావణి, పాలవలస రోహిణి, సూర్యకుమారి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సరెడ్డి పుల్లారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూధన్ రెడ్డి, ఇఫ్టూ జిల్లా నాయకులు ఎం.నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి సుధాకర్‌లు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాయల బిక్షం, గౌరవ అధ్యక్షుడు తోట రమేష్, కోశాధికారి కొత్తపల్లి సతారాములు, రైతు సంఘం జిల్లా నాయకులు ఎడారి రమేష్, దండగుల బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మారెడ్డి, సీఐటీయూ నాయకులు బొల్లం రాజు, టీయూసీఐ నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, ఇఫ్టూ నాయకులు రమేష్, రవి పాల్గొన్నారు.

బడ్జెట్‌పై నిరసనల వెల్లువ



బూర్గంపాడు: ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



భద్రాచలంఅర్బన్: అంబేడ్కర్ సెంటర్‌లో బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మణుగూరుటౌన్: బీజేపీ మిత్రపక్షాలకు కేంద్రం బడ్జెట్‌లో అధిక మొత్తాలను కేటాయిస్తూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు మొండిచేయి చూపిందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ మేరకు సోమవారం మణుగూరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అన్ని మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కలిసి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ డౌన్ డౌన్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. మరోవైపు, అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలోనూ బడ్జెట్‌ను నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, నాయకులు రాజు, లెనిన్, తోట పద్మ, గౌరీ, శ్రీను, స్వరూప, జగదీష్ పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బండారు శరత్ బాబు అన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సోమవారం భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటరామారావు అధ్యక్షతన జరిగింది. పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారెల్లి సంతోష్ కుమార్, సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు కోరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టింది. నాయకులు బూర్గంపాడు ప్రధాన కూడలిలో బడ్జెట్ ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బడా పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బయ్యా రాము, పాండవుల రామనాథం, ఎస్‌కె.అబీదా, గుంటక కృష్ణ, కమటం మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు పోతుగంటి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఎస్‌కేఎం కమిటీ జాతీయ పిలుపులో భాగంగా సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యంలో ములకలపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్మిక, కర్షక, శ్రామిక ప్రజలకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. ఆయా పార్టీల మండట నాయకులు ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, యర్రగొర్ల రామారావు, శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, నకిరకంటి నాగేశ్వరరావు, శనగాని వినోద్, వేణు పాల్గొన్నారు.